సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 23 । అక్టోబర్ । 2023



రైళ్లు, బస్సులు ఫుల్
దసరా ప్రయాణికులతో రైళ్లు, బస్సులు రద్దీగా నడుస్తున్నాయి. ఆర్టీసీ, రైల్వేలు స్పెషల్ సర్వీసులు నడుపుతున్నాయి. 8లో



అప్పన్న జమ్మివేట రేపు
విజయదశమి పురస్కరించుకుని మంగళవారం సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి జమ్మివేట ఉత్సవం జరగనుంది. 8లో



శాకంబరిగా కనకమహాలక్ష్మి
కనకమహాలక్ష్మి అమ్మవారిని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

ఘనంగా దుర్గమ్మ బోనాలు



బోనాలుతో బయలుదేరిన మహిళలు

వై.రామవరం: దేవీనవరాత్రులు పురస్కరించుకుని మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలోని కనకదుర్గమ్మవారి ఆలయంలో బోనాలు పండుగ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. అనంతరం వాటిని దేవరమడుగులు వద్ద పెద్దేరువాగులో నిమజ్జనం చేశారు.

ఆంధ్రా కశ్మీర్‌లో సందడే సందడి



చెరువులవేనంలో పర్యాటకుల తాకిడి

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన మండలంలోని లంబసింగిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పర్యాటకులు ఇక్కడి మంచు అందాలను తిలకించి పరవశించి పోయారు. సమీపంలోని చెరువులవేనం కొండల్లో ఎత్తయిన పర్వతాల నడుమ పాల సంద్రాన్ని తలపించే మంచు అందాలకు మంత్ర ముగ్ధులయ్యారు.

కొత్తపల్లి జలపాతానికి పోటెత్తిన పర్యాటకులు



కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. విద్యాసంస్థలు, ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాలకు దసరా సెలవులు కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, పలు ప్రాంత పర్యాటకులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వాహనంలో తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు.

ఆకట్టుకున్న పొద్దుతిరుగుడు అందాలు



దుంబ్రిగుడ సమీపంలో పొద్దుతిరుగుడు పూల అందాల్లో పర్యాటకులు

దుంబ్రిగుడ: మండలంలోని చాపరాయి జలపాతానికి పర్యాటకుల తాకిడి నెలకొంది. దూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. అరకు–పాడేరు ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న వలిసె, పొద్దు తిరుగుడు పూల అందాల్లో ఫొటోలు తీసుకుని ఉల్లాసంగా గడిపారు.

నేటి నుంచి 27 వరకు స్వగ్రామంలో ఎంపీ మాధవి



కొయ్యూరు: ఈనెల 27 వరకు స్వగ్రామం శరభన్నపాలెంలో ఉంటామని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా వచ్చి తనను కలవవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



నవ్యశ్రీ (ఫైల్)

జి.మాడుగుల: మండలంలోని సింగర్భ పంచాయతీ చేపల్లి గ్రామానికి చెందిన సాగేని మత్స్యకొండాచారి కుమార్తె సాగేని నవ్యశ్రీ (15)ఆదివారం మృతి చెందింది. రెండు రోజుల నుంచి గొంతులో కాయతో ఇబ్బంది పడుతూ అస్వస్థతకు గురై మృతి చెందిందని బంధువులు తెలిపారు. ఈమె హుకుంపేటలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో టెన్త్ చదువుతోంది. దసరా సెలవులకు ఆమె ఇంటికి వచ్చినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

రంప అందాలకు ఫిదా



ప్రముఖ పర్యాటక కేంద్రమైన గుడిసె వద్ద పర్యాటకుల సందడి

జిల్లాలోని రంప మన్యంలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. సెలవు వచ్చిందంటే చాలు ప్రకృతి ఒడిలో వాలిపోతున్నారు. సహజసిద్ధ అందాలను తిలకిస్తూ మధురానుభూతి పొందుతున్నారు.

- భారీగా తరలివస్తున్న పర్యాటకులు
- గతేడాది 1,87,176 మంది రాక
- ఈ ఏడాది ఇప్పటివరకు 1,14,273 మంది సందర్శన

రంపచోడవరం: మన్యం అందాలను తిలకించేందుకు వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సెలవు రోజులతో పాటు, శని, ఆదివారాల్లో పర్యాటకుల రాకతో సందడి నెలకొంటోంది. జిల్లాలో అరకు తరువాత అత్యధికంగా మారేడుమిల్లి ప్రాంతానికి పర్యాటకులు వస్తున్నారు. మారేడుమిల్లి, రంపచోడవరంలో పర్యాటకులు బస చేసేందుకు పర్యాటకశాఖకు చెందిన అతిథి గృహాలు అందుబాటులో ఉన్నాయి.

- మారేడుమిల్లి, గుడిసె ప్రాంతాలను గతేడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 1,87,176 మంది సందర్శించారు. అలాగే ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,14,273 మంది పర్యాటకులు వచ్చినట్టు ఆశాఖ అధికారులు చెబుతున్నారు.
- ఏటా నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు ఈ ప్రాంతానికి తరలివస్తున్నారు. గత ఏడాది ఈ మూడు నెలల్లో సుమారు 12 వేల మంది పర్యాటకులు వచ్చారు.
- పర్యాటకుల రాకతో అనుబంధ రంగాలకు చెందిన కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. ఏటా రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు బొంగు చికెన్ వ్యాపారం జరుగుతోంది. ప్రైవేట్ అతిథి గృహాల నిర్వాహకులకు ఆదాయం లభిస్తోంది.
- జలతరంగణి, అమృతధార, గుడిసె ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే పర్యాటకులు మారేడుమిల్లిలో బస చేస్తున్నారు.
- మారేడుమిల్లిలో పర్యాటకుల తాకిడి వలల్ల అతిథి గృహాలు అందుబాటులో లేని సందర్భంలో రంపచోడవరం, గెద్దాడ, సున్నంపాడు ప్రాంతాల్లో బస చేస్తున్నారు.
- మారేడుమిల్లిలో త్రీస్టార్ సౌకర్యాలతో పర్యాటక శాఖకు చెందిన ఉడ్స్ రిసార్ట్స్ అందుబాటులో ఉంది
- జంగిల్ స్టార్ క్యాంప్ పేరుతో పాములేరు వద్ద అటవీశాఖ అతిథి గృహాలను పర్యాటకులకు మధురానుభూతి మిగిల్చేలా తీర్చిదిద్దారు.

సీబీఈటీ సభ్యులకు ఆదాయం

ఎకో టూరిజం ద్వారా నిర్వహిస్తున్న పర్యాటకం ద్వారా సీబీఈటీ సభ్యులకు మంచి ఆదాయం వస్తోంది. పర్యాటకులుఆనందంగా గడిపేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని మారేడుమిల్లి రేంజర్ అజాద్ తెలిపారు.



మారేడుమిల్లి జలతరంగణి వద్ద పర్యాటకులు



మారేడుమిల్లిలో ఉడ్ రిసార్ట్

గుర్తుండిపోయే మధురానుభూతి



మారేడుమిల్లి అందాలను తిలకించేందుకు తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చాం. ఇక్కడ ప్రకృతి అందాలు మైమరిపించాయి. ఎత్తయిన కొండలు, జలపాతాలు మధ్య గడిపిన క్షణాలు ఎంతో సంతోషాన్ని నింపాయి. జీవితంలో గుర్తుండిపోయాలా మధురానుభూతి పొందాం.

– రజిత కస్తూరి, జగిత్యాల, తెలంగాణ

బొర్రాకు రూ.6.3 లక్షల ఆదాయం



బొర్రా గుహలను తిలకిస్తున్న సందర్శకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. శని, ఆదివారాల్లో రికార్డుస్థాయిలో తరలివచ్చారు. ఆదివారం ఏడు వేల మంది తిలకించగా, రూ.6.3 లక్షల ఆదాయం వచ్చింది. శనివారం ఐదు వేల మంది తిలకించగా రూ.5 లక్షలు ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. మండలంలోని తాటిగుడ, సరియా, కటికి, చిట్టంపాడు జలపాతాలు పర్యాటకులతో సందడి మారాయి.. అరకు–విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న డముకు, గాలికొండ వ్యూపాయింట్ పర్యాటకులతో కళకళలాడాయి. భారీస్థాయిలో వాహనాల్లో తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

భద్రాద్రి దేవస్థానం భూముల్లో చెట్ల నరికివేత

- అడ్డుకున్న సాగుదారులు
- ఇరువర్గాల మధ్య తోపులాట
- పరిస్థితిని అదుపులోకి తెచ్చిన రెవెన్యూ, పోలీసు అధికారులు



భద్రాద్రి ఈవో రమాదేవితో మాట్లాడుతున్న ఎటపాక తహసీల్దార్ పృథ్వీ

ఎటపాక: భద్రాద్రి దేవస్థానం భూముల్లో అధికారులు చెట్ల నరికివేత చేపట్టడం తోపులాటకు దారితీసింది. దీంతో మరోమారు ఘర్షణ వాతావరణం నెలకొంది. ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలావున్నాయి.

పురుషోత్తపట్టణంలోని భద్రాద్రి దేవస్థానం భూములుగా చెబుతున్న వాటిలో ఆ గ్రామానికి చెందిన రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఈ భూములపై ఇటీవల పలుమార్లు రైతులకు, దేవస్థానం అధికారులకు మధ్య వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం దేవస్థానం ఈవో రమాదేవి సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లి రైతుల సాగులో ఉన్న భూమిలోని జామాయిల్ చెట్లను నరికిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న సదరు రైతులు దేవస్థానం సిబ్బందిని అడ్డుకున్నారు. ఈభూమిపై స్టేటస్కో పత్రాలు ఉన్నప్పటికి దేవస్థానం అధికారులు ఈవిధంగా దౌర్జన్యానికి పాల్పడటం సరికాదని రైతులు వాదించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ సమాచారం తెలుసుకున్న ఎటపాక తహసీల్దార్ పృథ్వీ, ఎస్ఐ పార్థసారధి అక్కడకు చేరుకుని రైతులు,దేవస్థానం సిబ్బందిని శాంతింపజేశారు. భూముల విషయంలో చట్టపరంగా న్యాయస్థానంలో తేల్చుకుని నిర్ణయం తీసుకోవాలని దేవస్థానం అధికారులకు సూచించారు. ఎటువంటి సమాచారం లేకుండా చెట్లను నరికి వేయటం సరికాదని వారు హితవు పలికారు.

డోలీలో మృతదేహం తరలింపు



డోలీలో అద్దన్న మృతదేహాన్ని మోసుకొని వెళ్తున్న కొండపడ గ్రామ గిరిజనులు

ముంచంగిపుట్టు: మృతదేహాన్ని తరలించేందుకు సీహెచ్‌సీ సిబ్బంది అంబులెన్సు ఇచ్చేందుకు నిరాకరించడంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర డోలీలో మోసుకొని వెళ్లాల్సి వచ్చిందని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాలిలావున్నాయి. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామానికి చెందిన కిముడు అద్దన్న(54) ఆదివారం సాయంత్రం ఆకస్మికంగా ఇంటి వద్ద స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హుటాహుటిన స్థానిక సీహెచ్‌సీకి ఆటోలో తీసుకువచ్చారు. వెంటనే అతనికి వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ప్రయత్నించారు. అయితే అప్పటికే మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని కొండపడ గ్రామానికి తీసుకువెళ్లేందుకు అంబులెన్సు ఏర్పాటు చేయాలని సీహెచ్‌సీ వైద్యులను ఆశ్రయించగా నిబంధనల ప్రకారం ఇవ్వడానికి కుదరదని వారు చెప్పారని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో చేసేదీమీలేక సీహెచ్‌సీ నుంచి గ్రామస్తుల సహకారంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర డోలీలో మోసుకొని స్వగ్రామం తరలించామని వారు పేర్కొన్నారు. దీనిపై ఆస్పత్రి సీనియర్ వైద్యాధికారి మౌనికను వివరణ కోరగా వారు అడిగిన సమయంలో అంబులెన్సు సిద్ధంగా లేదన్నారు. కాసేపటికే సమకూర్చినప్పటికీ, ఆలస్యమైందన్న సాకుతో నిరసన తెలిపి మృతదేహాన్ని డోలీలో తీసుకువెళ్లి పోయారన్నారు. అయినప్పటికీ డోలీలో మోసుకొని వెళ్తుండగా వారి వద్దకు అంబులెన్సు పంపించినా వారు ఉపయోగించుకోలేదన్నారు.

డిసెంబర్ 9న ఏయూ పూర్వ విద్యార్థుల సమావేశం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సమావేశం డిసెంబర్ 9వ తేదీన జరగనుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరగనున్న వేప్స్ 2023కి ముఖ్య అతిథిగా టటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్ హాజరుకానున్నారు. ఇప్పటికే పూర్వవిద్యార్థుల సంఘం ఆహ్వాన పత్రాలను పంపే ప్రక్రియను ప్రారంభించింది. విదేశాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు వచ్చేందుకు వీలుగా ముందుగా ఆహ్వానాలు పంపుతున్నారు.

కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టం

చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

కూనవరం: ఆదివాసీ పోరాట యోధుడు గిరిజనుల ముద్దుబిడ్డ కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. మండల పరిధిలోని కోతులగుట్ట గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడు ఆదివాసీల ముద్దుబిడ్డ కొమరం భీమ్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఏసమస్య ఉన్నా నేరుగా దర్బారుకు రావాలని కోరారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు , చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. చింతూరు తహసీల్దార్ కారం సుబ్బారావుతో కలిసి ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు సున్నం వెంకటేశ్వరరావు, తుష్టి జోగారావు, మచ్చావినయ్, ఉయికాప్రసాద్, మడివి రవితేజ, కుంజా అనిల్, ఎంపీపీలు పాయం రంగమ్మ, అమల, జెడ్పీటీసీలు గుజ్జా విజయ, ఉబ్బ సుస్మిత సర్పంచ్ కారం పార్వతి, వైఎస్ఎంపీపీ కొమరం పెంటయ్య, పాడియం అప్పారావు, ఏఎస్‌డీఎస్ సంస్థ వ్యవస్థాపకులు వీగాంధీ బాబు, నాలుగు మండలాల ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



ఆదివాసీల జెండాను ఆవిష్కరిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య

పాడేరులో ఆధ్యాత్మిక శోభ

- దుర్గాష్టమి సందర్భంగా మోదమ్మకు ప్రత్యేక పూజలు
- ఆలయం వద్ద అన్నసమారాధన

సాక్షి,పాడేరు: దుర్గాష్టమి సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రమైన పాడేరులో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. స్థానిక మోదకొండమ్మతల్లి ఆలయానికి భక్తులతోపాటు భవానీ మాలధారులు భారీగా తరలిరావడంతో రద్దీ ఏర్పడింది.అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ ప్రసాదాన్ని పంపిణీ చేసింది. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ,ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు, భక్తుల సహకారంతో ఏర్పాటుచేసిన అన్నసమారాధనను ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర తమర్భ నరసింగరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమం విజయవంతానికి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు కృషి చేశారు. గుడివాడలోని గోల్డ్‌మార్కెట్‌లో కంచికామాక్షి అమ్మవారి ఉత్సవాల సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం, బంగారం వర్తకుల ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటుచేశారు.



మోదకొండమ్మతల్లి దర్శనానికి బారులు తీరిన భవాని భక్తులు



భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న డాక్టర్ నరసింగరావు, ఆలయ, ఆధ్యాత్మిక కమిటీ సభ్యులు

అల్లూరి జిల్లా డీఆర్వోగా భవాని

మహారాణిపేట (విశాఖ): అల్లూరి సీతారామరాజు జిల్లా డీఆర్వోగా డిప్యూటీ కలెక్టర్ కె.భవాని నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమెతోపాటు జిల్లాలో పలువురు డిప్యూటీ కలెక్టర్లకు బదిలీలు జరిగాయి.

ఏఎంసీ వందేళ్ల వేడుకల ఏర్పాట్ల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ తదితరులు

మహారాణిపేట: ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పడి వందేళ్లయిన సందర్భంగా నిర్వహించే వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఆదివారం పరిశీలించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న వేడుకలకు ముఖ్యఅతిథిగా భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ఇతర ప్రముఖులు, కళాశాలలో విద్యాభ్యాసం చేసి ఉన్నత పదవుల్లో ఉన్న పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న పనులను జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, వైద్యాధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేసి వేడుకల నిర్వహణ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్మిస్తున్న భవనాన్ని కూడా పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనుల గురించి ఆరా తీశారు. కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్, ప్రణాళిక గురించి అడిగి తెలుసుకున్నారు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఈఈ నాయుడు, డీఈ మన్మథరావు, రిటైర్డు డీఎంఈ డాక్టర్ టి.రవిరాజ్, పద్మశ్రీ డాక్టర్ ఆదినారాయణ, డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు, డాక్టర్ శశిప్రభ, డాక్టర్ నవీన్, డాక్టర్ టి.రాధ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు ఊతం.!

- ఇంటర్‌లో ఫెయిలైన వారికి మరో అవకాశం
- రెగ్యులర్ లేదా ఓపెన్ కోర్సుల్లో చేరేలా అవగాహన
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 15,738 మంది ఫెయిలైన విద్యార్థులు
- కాలేజీల్లో చేరితే రెగ్యులర్ విద్యార్థులతో సమానం
- ఫీజు చెల్లింపునకు ఈ నెల 30తో ముగుస్తున్న గడువు


అభ్యసిస్తున్న విద్యార్థినులు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరై పాసైతే మార్కుల మెమోపై కంపార్ట్‌మెంట్ అని కాకుండా రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైనట్లుగానే గుర్తింపు ఇవ్వనున్నారు. తప్పిన వాటితో పాటు అన్ని సబ్జెక్టులు రాసినా, ఎక్కువ మార్కుల వచ్చిన వాటినే పరిగణనలోకి తీసుకుంటారు.

ఇంటర్మీడియెట్‌తోనే ఆగిపోకుండా విద్యార్థులను ఉన్నత చదువుల వైపు తీసుకురావాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15,738 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫెయిలైన వారు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. వీరందరితో వార్షిక పరీక్షలకు ఫీజు కట్టించే బాధ్యతలను కాలేజీల ప్రిన్సిపాళ్లకు అప్పగించారు. ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ దీనిపై విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లతో ప్రతి రోజూ వెబెక్స్ ద్వారా సమీక్ష చేస్తూ, నూరు శాతం లక్ష్య సాధనకు దిశానిర్దేశం చేస్తున్నారు.

జిల్లా	కాలేజీలు	ఫెయిలైన విద్యార్థులు	ఫీజు చెల్లించిన వారు
విశాఖపట్నం	173	8,397	4,006
అనకాపల్లి	133	6,323	2,612
అల్లూరి	72	1,018	339
మొత్తం	378	15,738	6,957

ఫెయిలైనా మళ్లీ కాలేజీకి..

2021–22, 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం తప్పిన విద్యార్థులు మళ్లీ కాలేజీల్లో చేరి, చదువుకోవచ్చు. ఇలా విశాఖలో 8,397 మంది, అనకాపల్లిలో 6,323 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,018 మంది విద్యార్థులు ఉన్నారు. కాలేజీల్లో అడ్మిషన్ తీసుకుంటే వారిని రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణించి ‘అమ్మఒడి’ వంటి సంక్షేమ పథకాలు కూడా మంజూరు చేస్తారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఈ నెల 30తో ముగియనున్న గడువు

2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యే ఫెయిలైన విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30 వరకు గడువు ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో గుర్తించిన 15,738 మందిలో శుక్రవారం నాటికి 6,947 మంది ఫీజు చెల్లించారు. ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించే అవకాశం ఉన్నందున నూరు శాతం లక్ష్యం సాధించేలా దసరా సెలవుల్లో విద్యార్థులకు అవసరమైన సహకారం అందించాలని కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు. వీటిపై సందేహాల నివృత్తికి విశాఖపట్నంలోని ఆర్ఐవో కార్యాలయం ఫోన్ నంబర్ 0891–2552854కు సంప్రదించేలా తగిన ఏర్పాట్లు చేశారు.

ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి



ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులను తిరిగి కాలేజీల్లో చేర్పించటం, లేదంటే పరీక్షలకు హాజరయ్యేలే ఫీజు చెల్లించడం బాధ్యతను కాలేజీల ప్రిన్సిపాళ్లకు అప్పగించాం. సచివాలయ స్థాయిలో జరిగిన డ్రాపవుట్స్ సర్వే ఆధారంగా గుర్తించిన విద్యార్థులందరితో తప్పనిసరిగా ఫీజు కట్టించుకోవాలి.

– రాయల సత్యనారాయణ, ఆర్ఐవో ఉమ్మడి విశాఖ జిల్లా

విద్యార్థులకు మంచి అవకాశం



ఫెయిలైన్ విద్యార్థులకు ఇదో చక్కటి అవకాశం. రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా గుర్తింపు ఇస్తున్నందున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మా కాలేజీ పరిధిలోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. అధ్యాపకులను దీనిలో భాగస్వామ్యులను చేశాం.

–పి.ఉమారాణి, సీనియర్ ప్రిన్సిపాల్, భీమునిపట్నం

సివిల్స్ శిక్షణ పరీక్షకు 503 మంది హాజరు


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి రజని

పాడేరు రూరల్ : ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత సివిల్స్ శిక్షణ రెండో దశ స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం పట్టణంలోని తలారిసింగి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించారు. రెండు కేంద్రాల్లో 503 మంది పరీక్ష రాసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని పర్యవేక్షించారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు


కె కోడాపల్లి వద్ద బైక్‌ల ప్రమాదంలో గాయపడిన బిల్క్రిస్ట్

జి.మాడుగుల: పాడేరు రోడ్డు మార్గంలో కెకోడాపల్లి వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఎదరెదురుగా వస్తున్న చింతపల్లి మండలం అన్నవరం గ్రామానికి చెందిన పాంగి బిల్క్రిస్ట్, జి.మాడుగుల మండలం పెదలోచలి గ్రామానికి చెందిన అజిత్‌కుమార్ బైక్‌లు కె.కోడాపల్లి సమీపంలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో అజిత్‌కుమార్ కాలు నుజ్జయింది. బిల్క్రిస్ట్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. వీరికి 108 వాహనం ఈఎన్‌టీ లోకేష్, పైలెట్ రామచంద్రరావు అత్యవసర సేవలు అందించారు. అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అప్పన్న జమ్మివేట ఉత్సవం రేపు

- పూలతోట ముస్తాబు
- ఉత్సవంలో రామాలంకారంలో దర్శనమివ్వనున్న అప్పన్న
- రేపు సాయంత్రం 6 గంటల వరకే దర్శనాలు


ముస్తాబైన ప్రధాన మండపం

సింహాచలం: విజయదశమి పురస్కరించుకుని మంగళవారం సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జమ్మివేట ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు విశేష ఏర్పాట్లు చేశారు. పూలతోటను ముస్తాబు చేస్తున్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ, ప్రధాన మండపానికి, శ్రీకృష్ణ కొలను, రాతి ఫౌంటైన్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సింహగిరి మెట్లమార్గం, పూలతోట, స్వామి తిరువీధి జరిగే అడవివరం పురవీధుల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. గోపాలపట్నం పోలీసులు భద్రత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఉత్సవం ఇలా..

వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రామాలంకారం చేసి మంగళవారం నాలుగు గంటల సమయంలో సింహగిరి నుంచి మెట్లమార్గంలో పల్లకీలో కొండదిగువకి తీసుకొస్తారు. కొండదిగువ ఉన్న పూలతోటలోని ప్రధాన మండపంలో స్వామిని అధిష్టింపజేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి పూజలు ప్రారంభిస్తారు. తొలుత పూలతోటలోని శమీవృక్షం వద్ద శమీపూజ నిర్వహిస్తారు.

అనంతరం ఆ శమీ దళాలను స్వామి చెంతన ఉంచి పూజలు చేపడతారు. జమ్మివేట ఉత్సవం నిర్వహించి.. తదుపరి స్వామిని పుష్కరిణి మండపం వద్దకు తీసుకొస్తారు. అక్కడ అశ్వవాహనంపై అధిష్టిస్తారు. రాత్రి అడవివరంలో స్వామికి అశ్వవాహనంపై తిరువీధి నిర్వహిస్తారు. అర్ధరాత్రి సమయంలో స్వామిని కొండపైకి చేరుస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం సాయంత్రం 6 గంటల వరకే స్వామి దర్శనాలు లభిస్తాయని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

యువకుడి అనుమానాస్పద మృతి


సాయి(ఫైల్)

మాకవరపాలెం: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు ఆదివానం తెలిపారు. మండలంలోని తామరం గ్రామానికి చెందిన పెదపల్లి సాయి(23) శనివారం రాత్రి స్నేహితులతో కలిసి పార్టీకి వెళ్లాడు. అతడు తిరిగి వచ్చి ఇంటి సమీపంలో రోడ్డు పక్కనే గాయాలతో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి మరణించినట్టు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. యువకుడి మృతికి ఏదైనా ప్రమాదమా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. పార్టీకి వెళ్లిన స్నేహితులను విచారణ చేస్తున్నట్టు వివరించారు.

పసుపు బస్తాలు జారి పడి కూలీ దుర్మరణం


పెంటారావు మృతదేహం

కశింకోట: మండలంలోని బయ్యవరంలో లోడ్ చేస్తున్న సమయంలో లారీ నుంచి పసుపు బస్తాలు జారి మీద పడి కూలీ దుర్మరణం చెందాడు. ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. కశింకోటలోని గాడి వీధికి చెందిన బొబ్బరి పెంటారావు(38) బయ్యవరంలోని కొణతాల కోల్డ్ స్టోరేజిలో రోజు వారీ కూలీగా పని చేస్తున్నాడు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం పొద్దుపోయిన తర్వాత లారీపై పసుపు బస్తాలు ఎక్కించగా, అదే సమయంలో లోడ్ చేసిన కొన్ని బస్తాలు అతడిపై పడ్డాయి. దీంతో ఛాతిపైన, ఇతర భాగాలపైన తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు అయిన పెంటారావు మృతితో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి సంఘటన తీరు తెలుసుకుని తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

పీఎం పాలెం: ఎండాడ దిశ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మరుపల్లికి గ్రామానికి చెందిన గేదెల హేమలత(32) ఇద్దరు పిల్లలతో కలిసి మధురవాడలో నివసిస్తోంది. భర్త రైల్వే ఉద్యోగి. నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూడటానికి వరుసకు సోదరుడైన యర్రా నారాయణరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. దిశ పోలీస్ స్టేషన్ ఎదురుగా వచ్చేసరికి అదే రోడ్డులో విజయనగరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వెనుక కూర్చున్న హేమలత తుళ్లి పడింది. తలకు బలమైన గాయం కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. వాహనం నడుపుతున్న నారాయణరావుకు గాయాలయ్యాయి. గీతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. నారాయణరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

రైళ్లు, బస్సులు ఫుల్

- దసరా స్పెషల్స్‌కు డిమాండ్
- అదనపు చార్జీలు లేకపోవడంతో ఆర్టీసీకి ఆదరణ
- 25 నుంచి తిరుగు ప్రయాణాలకు పెరగనున్న తాకిడి


ప్రయాణికులతో కిటకిటలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్

సాక్షి, విశాఖపట్నం: దసరా పండగకు వెళ్లే వారితో రైళ్లు, బస్సులు రద్దీతో నడుస్తున్నాయి. ఈ పండగను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ, రైల్వేలు స్పెషల్ బస్సులు, స్పెషల్ రైళ్లను నడుపుతున్నాయి. దాదాపు నాలుగైదు రోజుల నుంచి వీటిలో ప్రయాణికులు కిటకిటలాడుతూ కనిపిస్తున్నారు. ఈ దసరాకు రెగ్యులర్ సర్వీసులతో పాటు ఆర్టీసీ విశాఖ రీజియన్ నుంచి సుమారు 500 స్పెషల్ బస్సులను నడపడానికి ఏర్పాట్లు చేసింది. విశాఖ వైపు వచ్చే వారి కోసం హైదరాబాద్ నుంచి 20, విజయవాడ నుంచి 10 బస్సులను నడుపుతున్నారు. ఇంకా వివిధ ప్రాంతాల నుంచి విశాఖపట్నం వచ్చి, ఇక్కడ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లే వారి కోసం మరో 200 బస్సులను సమకూర్చారు. వీటితో పాటు రాజమండ్రి, అమలాపురం, కాకినాడల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ బస్సులతో పాటు స్పెషల్ బస్సులూ జనంతో రద్దీగా ఉంటున్నాయి. దసరా రోజుల్లో ఈ రీజియన్ నుంచి నడిచే బస్సుల్లో సగటున ఆక్యుపెన్సీ రేషియో 85 శాతం వరకు ఉంటోంది. శనివారం ఒక్కరోజే హైదరాబాద్ నుంచి విశాఖకు ఐదు రెగ్యులర్, మరో ఐదు స్పెషల్స్, విజయవాడ నుంచి 15 రెగ్యులర్, 10 స్పెషల్స్, విశాఖ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు మరో 150 వరకు స్పెషల్స్ నడిపారు. ఆదివారం కాస్త రద్దీ తగ్గడంతో సుమారు 70 స్పెషల్స్‌ను తిప్పారు. సోమ, మంగళవారాల్లో ప్రయాణాలు తగ్గనున్నాయి. పండగ అయ్యాక 25 నుంచి మళ్లీ తిరుగు ప్రయాణాలు మొదలవుతాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని 25 నుంచి 30వ తేదీ వరకు 200 వరకు స్పెషల్ బస్సులను నడపనున్నారు. వీటిని విశాఖ నుంచి రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు పంపించనున్నట్టు ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు ‘సాక్షి’కి చెప్పారు. ఈ బస్సులకు ముందస్తు రిజర్వేషన్లు చేయించుకుంటున్నారని తెలిపారు. మరోవైపు దసరా స్పెషల్స్‌కు కూడా సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నారు. దీంతో మునుపటికి భిన్నంగా స్పెషల్ బస్సుల్లోనూ ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది.

రైల్వే స్టేషన్ కిటకిట..

దసరా ప్రయాణికులతో రైళ్లన్నీ కిక్కిరిసిపోయాయి. విశాఖ నుంచి, విశాఖ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లు రద్దీగా కనిపిస్తున్నాయి. రైల్వే శాఖ ఈ దసరాకు పది వరకు స్పెషల్స్‌ను నడుపుతోంది. ఇప్పటికే రోజూ నడిచే రెగ్యులర్ రైళ్లతో పాటు స్పెషల్స్ కూడా జనంతో కిటకిటలాడుతున్నాయి. రిజర్వేషన్ బోగీల్లోనూ సాధారణ టికెట్టు ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. దసరా పండగ తర్వాత తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లే వారు ఇప్పటికే రైళ్లలో రిజర్వేషన్లు చేయించుకున్నారు. దీంతో అనేక రైళ్లకు ‘రిగ్రెట్’ వస్తోంది.


రైలు వద్ద రద్దీ